I

సాక్షి
వికారాబాద్

శుక్రవారం, 11, అక్టోబర్, 2024



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

సద్దుల సంబురం

సద్దుల బతుకమ్మ సంబరాలు గురువారం జిల్లాలో అంబరాన్ని తాకాయి. ఆడపడుచులు సంప్రదాయ వస్త్రాలు ధరించి.. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. గ్రామాల్లోని చౌరస్తాల్లో వాటిని ఒకచోట చేర్చి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ వాటి చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో హోరెత్తించారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. చివరగా ఊరేగింపుగా బతుకమ్మలను తీసుకెళ్లి సమీపంలో చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.



పూడూరు: మంచన్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



బొంరాస్‌పేట: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మతో యువతి

న్యూస్‌రీల్

నేడు సమీకృత గురుకులానికి భూమిపూజ

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



భూమిపూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ శివారులో సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి శుక్రవారం ఉదయం 11 గంటలకు భూమిపూజ, శంకుస్థాపన చేయనున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం స్థలాన్ని సందర్శించారు. భూమిపూజ ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను నిర్మించనున్నారు. ఇందుకోసం పాత కొడంగల్ గ్రామ శివారులో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన వ్యక్తిగత సిబ్బంది తెలిపారు.

నేడు లక్ష కుంకుమార్చన



పూజలందుకున్న స్వామివారు

దుద్యాల్: మండలంలోని హకీంపేట్‌లో వెలసిన శ్రీ రాకమకొండ వేంకటేశ్వర స్వామి, సరస్వతీ దేవి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాకం యాదయ్య గురువారం తెలిపారు. శుక్రవారం లక్ష కుంకుమార్చన, సాముహిక లలిత సహస్రనామ పారాయణం.. శనివారం ఉపన్యాసం, భజన, అన్నమచార్య సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు వికారాబాద్‌కు ఓవైసీ

అనంతగిరి: వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటలో శుక్రవారం నిర్వహించే మిలాద్ ఉన్ నబీ జల్సా కార్యక్రమానికి ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి

షాబాద్: యువత క్రీడల్లో రాణించాలని చేవెళ్ల ఏసీపీ కిషన్, షాబాద్ సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో దసరా పుసర్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొనగా, విజేతగా కుమ్మరిగూడ జట్టు, రన్నర్‌ఫగా అంతారం జట్టు, మూడో బహుమతి షాబాద్ జట్లు నిలిచాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ యువకుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలతో శారీరకదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు.

అమరవీరుల దినోత్సవం సందర్భంగా...

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పీఆర్‌ఆర్ స్టేడియంలో త్వరలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనేవారు 14వ తేదీ వరకు షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. 16వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు నవీన్‌రెడ్డి, సతీశ్‌కుమార్, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, యువకులు శ్రీను, రాజు, మజీద్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఎప్పటికో?

జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు 37,313

- 3 నెలల్లో కేవలం 487 అప్లికేషన్ల పరిశీలన
- ఏళ్ల తరబడి నిరీక్షణ
- కమిటీలు వేసి మూడు నెలలు దాటినా ముందుకు సాగని ప్రక్రియ



పరిగి పట్టణ పరిధిలో అనుమతి లేకుండా చేసిన వెంచర్

వికారాబాద్: జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. దరఖాస్తుల పరిశీలన కోసం ప్రభుత్వం కమిటీలు వేసి మూడు నెలలు దాటినా ఆశించిన మేర ఫలితం కనిపించడం లేదు. ఇంకా ఐదు శాతం దరఖాస్తుల వెరిఫికేషన్ కూడా పూర్తికాలేదు. మూడు నెలల క్రితం ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న వారు తమ ప్లాట్లు రెగ్యులరైజేషన్ అవుతాయని సంబరపడ్డారు. జిల్లా వ్యాప్తంగా 37వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. దశాబ్దాలుగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో డీటీసీపీ అనుమతులు లేకుండా వెంచర్లు వేసిన రియల్టర్లు సామాన్యులు, పేదలకు ప్లాట్లు విక్రయించారు. 2020లో అప్పటి ప్రభుత్వం టీఎస్ బీపాస్ నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఇంటి నిర్మాణ అనుమతులు పొందాలంటే ప్లాట్లకు, వెంచర్లకు అనుమతులు తప్పనిసరి చేసింది. దీంతో అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళనకు గురయ్యారు. నాలుగేళ్ల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు స్వీకరించింది. ఆ తరువాత మిన్నకుండిపోయింది. దీంతో దరఖాస్తుదారులకు మళ్లీ ఎదురు చూపులు తప్పలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించడంతో దరఖాస్తుదారులకు ఊరట లభించినట్లయ్యింది. అయితే అర్జీల పరిశీలనలో తీవ్ర జాప్యం జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

మొత్తం దరఖాస్తులు 37313

జిల్లాలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్లే దాదాపు 550 వరకు ఉన్నట్లు సమాచారం. వీటిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ప్రభుత్వ రుసుం చెల్లించి రెగ్యులరైజ్ చేసుకునేందుకు అవకాశం లభించింది. నాలుగు మున్సిపాలిటీల్లో 21,084 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా 585 గ్రామ పంచాయతీల్లో 16,229 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన నేపథ్యంలో వాటి వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించింది.

కమిటీల ఏర్పాటు

గత ప్రభుత్వం రెండు దఫాలుగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు స్వీకరించింది. కొందరు రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోగా మరి కొందరు రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేశారు. ఆ తరువాత కోర్టు కేసులు.. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆందోళనల నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌ను తాత్కాలికంగా పక్కన పెట్టింది. వ్యవసాయేతర భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లను ఎల్‌ఆర్‌ఎస్‌తో సంబంధం లేకుండా పాత పద్ధతిలోనే జరిగేలా ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతులు లేని వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాట్లన్నింటికీ క్రమబద్ధీకరణతో సంబంధం లేకుండానే క్రయ విక్రయాలు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు మూడు శాఖల అధికారులతో త్రిసభ్య కమిటీలు వేసింది. జీపీల్లో అర్జీల పరిశీలనకు ఆర్‌ఐ, టీపీఓ, పంచాయతీ కార్యదర్శి, ఇరిగేషన్ ఏఈలతో కూడిన కమిటీ వేయగా.. పట్టణాల్లో టీపీఓ, ఆర్‌ఐ, ఇరిగేషన్ ఏఈ, వార్డు ఆఫీసర్‌తో కమిటీలు వేసింది. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభించి మూడు నెలలు దాటినా ఇప్పటి వరకు జీపీల్లో 63, పట్టణాల్లో 424 మాత్రమే పరిశీలించారు. జిల్లాలో ఏఈల కొరత, ఆర్‌ఐలకు పని భారం కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

పారదర్శకంగా చేపట్టండి



వీడియో కాన్ఫరెన్స్ అడిషనల్ కలెక్టర్ సుధీర్, అధికారులు

అనంతగిరి: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం నగరం నుంచి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అన్ని జిల్లాల అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, మహిళా శక్తి క్యాంటిన్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. జిల్లాలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను అన్ని శాఖల సమన్వయంతో పరిశీలించాలని సూచించారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్‌లో మహిళా శక్తి క్యాంటిన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గౌతమ్, మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, డీటీసీపీఓలు పాల్గొన్నారు.



కొడంగల్ పట్టణ శివారులో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు

బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం

- కొడంగల్ చుట్టూ అర్ధ వలయాకారంలో..
- రెండు జాతీయ రహదారులకు లింకు
- పట్టణ శివారులో రెండు చోట్ల ఫ్లై ఓవర్లు

కొడంగల్: కొడంగల్ మీదుగా వెళ్తున్న రెండు జాతీయ రహదారులను కలిపేలా పట్టణం చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. కొడంగల్ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు ఉండరాదనే ఉద్దేశంతో అర్ధ వలయాకారంగా ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. రెండు చోట్ల ఫ్లై ఓవర్లను నిర్మిస్తారు. ఇన్నాళ్లు అనివార్య కారణాల వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. తిరిగి పనులను ప్రారంభించారు. హైదరాబాద్ – బీజాపూర్, మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారులను అనుసంధానం చేసే విధంగా రూపకల్పన చేశారు. కొడంగల్ నుంచి నాస్కన్ పల్లి వెళ్లే దారిలో ఒక చోట, కొడంగల్ – పరిగి జాతీయ రహదారిపై మరో చోట ఫ్లై ఓవర్లు నిర్మిస్తారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ రోడ్డు నుంచి బైపాస్ పనులను ప్రారంభించారు. అయితే బైపాస్‌లో భూమి కోల్పోయిన రైతులకు పరిహారం డబ్బులు చెల్లించడంలో జాప్యం జరిగింది. దీంతో పనులు ముందుకు సాగలేదు. నాలుగు కిలోమీటర్ల దూరం బైపాస్ ఉంటుంది. హైదరాబాద్ మార్గంలో రాకపోకలకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో ఫ్లై ఓవర్‌తో పాటు సర్వీస్ రోడ్లు వేయాలని అధికారులు నిర్ణయించారు. మహబూబ్‌నగర్, కోస్గి, దుద్యాల గేటు వరకు రోడ్డు విస్తరణ జరిగింది. దుద్యాల గేటు నుంచి కొడంగల్, తాండూరు మీదుగా చించోలి, మన్నాకెళ్లి వరకు రోడ్డు విస్తరణ జరగాల్సి ఉంది. నాలుగు లేన్ల రహదారి నిర్మిస్తారు. బెంగళూరు ముంబై జాతీయ రహదారులను కలిపే ఈ లింక్ హైవే 150 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంది.

జాతీయ రహదారి పనుల్లో జాప్యం

దుద్యాల నుంచి మన్నాకెళ్లి వరకు నిర్మించాల్సిన జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికార యంత్రాంగంలో చలనం లేదని బాధితులు విమర్శిస్తున్నారు. కల్వర్టుల కోసం భారీ తవ్వకాలు జరిపారు. తవ్వకాలు జరిపిన చోట రోడ్లపై గుంతలు పడ్డాయి. ఈ గుంతల్లో ద్విచక్ర వాహనాలు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై మద్యం తాగొద్దనందుకు..

ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై దాడి

- నిందితులపై కేసు నమోదు

తాండూరు: రోడ్డుపై మద్యం తాగొద్దని మందలించిన ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను ముగ్గురు వ్యక్తులు ఇంటికి వెళ్లి దాడి చేసిన సంఘటన తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ సీఐ సంతోష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరులోని సాయిపూర్ ప్రాంతానికి చెందిన కృష్ణ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా సాయిపూర్ ప్రాంతంలో రోడ్డు పక్కన ముగ్గురు యువకులు మందు తాగుతూ కనిపించారు. వారిని కృష్ణ మందలించాడు. దీంతో మందుబాబులు ఫజల్, జగదీష్, మరో వ్యక్తి ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను ఇంటి వరకు వెంబడించారు. ఇంట్లోకి చొరబడి దాడి చేశారు. కృష్ణ తల, ముఖానికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మందుబాబుల దాడిలో గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కృష్ణ



మాట్లాడుతున్న డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్రరావు

బకాయిలు చెల్లించండి

- లేదంటే భూములను వేలం వేస్తాం
- డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్రరావు
- 20 మంది రైతులకు నోటీసులు

పెద్దేముల్: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్రరావు కోరారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించని 20మంది రైతులకు గురువారం నోటీసులు ఇచ్చారు. రైతులను సహకార సంఘం కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. పంట రుణాలు ఎందుకు చెల్లించడం లేదని ఆరా తీశారు. వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం సూర్యచంద్రరావు మాట్లాడుతూ.. తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా 130 మంది రైతులు రూ.కోటి 24లక్షల దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారని తెలిపారు. సుమారు 60 మంది రైతులు రూ.80లక్షల 43వేలు చెల్లించాల్సి ఉందన్నారు. 20 మంది చాలా కాలంగా రూ.52 లక్షలు చెల్లించాల్సి ఉందని, వారికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే రికవరీ యాక్ట్ ప్రకారం రైతుల భూములను వేలం వేస్తామని పేర్కొన్నారు. సక్రమంగా డబ్బు కడితే ఎన్నిసార్లయినా రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో తాండూరు శాఖ బ్రాంచ్ మేనేజర్ మనోహర్‌రావు, సీఈఓ రాజమౌళి, రికవరీ మేనేజర్ అంక్షిత్, అధికారులు రాములు, డీఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా దయానంద్ రెడ్డి

తుర్కయంజాల్: తెలంగాణ ప్రదేశ్ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడకు చెందిన దాసరి దయానంద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దయానంద్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవిని కట్టబెట్టినందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి

బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా సహ ఇన్‌చార్జి కట్టా సుధాకర్‌రెడ్డి

షాద్‌నగర్: పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా సహ ఇన్‌చార్జి కట్టా సుధాకర్‌రెడ్డి నాయకులకు సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి బూత్‌లో ఇంటింటికీ తిరగాలని, ప్రతి బూత్‌లో విధిగా 200 సభ్యత్వాలు చేయించాలన్నారు. పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.

సీఎంఆర్ సరఫరా చేయాలి

అనంతగిరి: సీఎంఆర్‌ను ఈ నెల 31లోపు డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వానాకాలం సీఎంఆర్ (2023–24) సరఫరాపై రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లు పట్టిన బియ్యాన్ని (సీఎంఆర్) ఎఫ్‌సీఐకి, సీఎస్‌సీకి సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే వానాకాలం సీజన్(2024 – 25)కు సంబంధించిన వడ్ల కోసం మిల్లర్లు అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ వీ విజయలక్ష్మి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులు, మిల్లర్లతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాద కేసులో రూ.5వేల జరిమానా

యాలాల: రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి రూ.5 వేల జరిమానా విధిస్తూ తాండూరు మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ శివలీల గురువారం తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి యాలాల ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2015లో మండల పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. అప్పటి ఎస్ఐ అరుణ్‌కుమార్ ఘటనకు కారణమైన కర్నూలు జిల్లాకు చెందిన డ్రైవర్ చాకలి ఎల్లా కృష్ణుడిపై కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఎల్లా కృష్ణుడిని బాధ్యుడిగా చేస్తూ ఒక నెల జైలు శిక్ష లేదా రూ.5వేల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా వెంకటయ్యగౌడ్



స్పీకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వెంకటయ్యగౌడ్

ధారూరు: మండల కేంద్రానికి చెందిన న్యాయవాది వెంకటయ్యగౌడ్‌కు పీసీసీ లీగల్, హ్యూమెన్ రైట్స్ అండ్ ఆర్‌టీఐ సెల్ కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు సహకరించిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గురువారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లీగల్‌సెల్ కన్వీనర్‌గా నియమితులైన వెంకటయ్యగౌడ్‌ను స్పీకర్ అభినందించారు. కార్యక్రమంలో ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు విజయభాస్కర్ రెడ్డి, లింగనపల్లి అశోక్ ముదిరాజ్, నాయకులు మల్లేశం, బుజ్జయ్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం



అంరాధికలాన్‌లో పంట దిగుబడి అంచనా వేస్తున్న ఏఎస్ఓ సందీప్‌రెడ్డి

మోమిన్‌పేట: వర్షాలు సమృద్ధిగా కురవడంతో మొక్కజొన్న పంట బాగా పండిందని ఏఎస్ఓ(అసిస్టెంట్ స్టాటికల్ అధికారి) సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అంరాధికలాన్ గ్రామానికి చెందిన మహ్మద్ సాలవుద్దీన్ పొలంలో మొక్కజొన్న పంట దిగుబడి అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అంచనా వేశామన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడం, సమయానికి పంట యాజమాన్యం చేపట్టడంతో దిగుబడులు బాగా వస్తున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బంధువులు చంపుతామని బెదిరిస్తున్నారు

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: సీఐ భీంకుమార్

ధారూరు: భర్త చనిపోవడంతో పిల్లల్ని చూసుకుంటూ, పొలం పనులు చేసుకుంటున్న తనను బావ, అతని కొడుకు చంపుతామని బెదిరిస్తున్నారని ఓ బాధితురాలు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌కు గురువారం ఫిర్యాదు చేసింది. అనంతరం పోలీసులను ఆశ్రయించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండలం అంపల్లి గ్రామానికి చెందిన పత్తి సరస్వతి భర్త చనిపోయాడు. పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె బావ పత్తి సుధాకర్ అతని కొడుకు పవన్‌కుమార్ పొలం పనులను అడ్డుకోవడమే కాకుండాచంపుతామని బెదిరిస్తున్నారు. అనంతగిరిపల్లికి చెందిన కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. బావ, అతని కొడుకు నుంచి రక్షణ కల్పించాలని బాధితురాలు వేడుకుంది. ఈ విషయమై సీఐ భీంకుమార్‌ను వివరణ కోరగా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కన్నవారి కల సాకారం

గ్రామీణ నేపథ్యం ఉన్న వారందరూ అరకొర సదుపాయాలతో టీచర్ కొలువు సాధించాలని శ్రమించారు. రేయింబవళ్లు కష్టపడి ఎంచుకున్న లక్ష్యాన్ని అందుకున్నారు. కన్నవారి కలను నెరవేర్చేతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఒకే గ్రామం నుంచి ఐదుగురు ఉద్యోగాలు సాధించారు.

- ఒకే గ్రామంలో ఐదుగురికి ఉపాధ్యాయ ఉద్యోగాలు
- ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో హస్నాబాద్‌వాసుల హవా

దుద్యాల్: డీఎస్సీ ఫలితాల్లో తమ గ్రామానికి చెందిన ఐదుగురు ఉద్యోగాలు సాధించడంతో హస్నాబాద్‌వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందులో రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు కాగ మరొకరు మాజీ సైనికుడి కుటుంబ సభ్యుడు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన కోట్ల సుధా(ఎస్ఏ, గణితం), కోట్ల శ్రీకావ్య(ఎస్జీటీ), ఎస్.గౌతమి(ఎస్జీటీ), ఎస్.ప్రసన్నలక్ష్మి(ఎస్జీటీ), ఎంట్ల సునీల్‌కుమార్(ఎస్జీటీ)లు ఇటీవల ఉపాధ్యాయ నియమాక పత్రాలు అందుకున్నారు.

తండ్రి కలను నెరవేర్చారు



ఉద్యోగం సాధించిన సుధా, శ్రీకావ్య

గ్రామానికి చెందిన కోట్ల శ్రీశైలంగౌడ్ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి గతంలో చాలా సార్లు డీఎస్సీ పరీక్షలు రాసినా ఉద్యోగం రాలేదు. తాను పొందని ఉద్యోగం ఎలాగైన తన కూతుర్లు సాధించాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ఆయన వ్యవసాయం చేస్తూ కుమార్తెలు సుధా, శ్రీకావ్యలను పోటీ పరీక్షలకు సిద్ధం చేశారు. అప్పులు చేసి మరీ కూతుర్లను చదివించారు. దీంతో ఇటీవలే విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి తండ్రి కన్న కలను నిజం చేశారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం



నియామక ప్రతాలు చూపుతున్న గౌతమి, ప్రసన్నలక్ష్మి

గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ ఎస్.బిచ్చప్పకు గౌతమి, ప్రసన్నలక్ష్మి కూతుర్లు. ఇద్దరిని డీఎస్సీ పరీక్షలకు ఆయన సిద్ధం చేయించారు. తండ్రి సూచన మేరకు వారు కష్టపడి చదివి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించా రు. ఇద్దరు కూతుర్లు ఉద్యోగాలు సాధి ంచడంతో వారి కుటుంబంలో ఆనందానికి అవదుల్లేకుండా పోయాయి.

మాజీ సైనికుడి కొడుకు



నియామకపత్రంతో సునీల్‌కుమార్

దేశ రక్షణలో సేవలందించిన గ్రామానికి చెందిన ఎంట్ల కృష్ణ కుమారుడు సునీల్‌కుమార్ డీఎస్సీ పరీక్షలకు సిద్ధం అయ్యాడు. ఇటీవల ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇలా ఒకే గ్రామంలో ఐదుగురికి ఉపాధ్యాయ ఉద్యోగాలు వరించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దేశాన్ని విశ్వగురువుగా నిలుపుదాం

- సేవా భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి వాసుజీ
- వికారాబాద్‌లో స్వయం సేవకుల పథ సంచలన్



మాట్లాడుతున్న వాసుజీ

అనంతగిరి: భారతదేశాన్ని జగద్గురుగా నిలుపుదామని సేవా భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి వాసుజీ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు అవుతున్న తరుణంలో గురువారం వికారాబాద్ పట్టణంలో స్వయం సేవకులు పథ సంచలన్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం పాటుపడుదామన్నారు. వందేళ్ల నుంచి ఆర్ఎస్ఎస్ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ దేశ అభ్యున్నతిలో తనదైన పాత్ర పోషిస్తుందన్నారు. నేడు విదేశాల్లో సంఘం తన కార్యక్రమం నడిపిస్తుందన్నారు. ప్రపంచ దేశాలు నేడు మన వైపు చూస్తున్నాయన్నారు. నేడు రక్షణ రంగంలో బలమైన శక్తిగా ఎదిగామన్నారు. అందరం సంఘటితమై ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ డాక్టర్ సత్యనారాయణగౌడ్, నగర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు సదానందరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, వడ్లనందు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, కార్యదర్శి శ్రీలత, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, బీజేపీ, బీజేవైఎం, తపస్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి పరిశీలన



ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

తాండూరు: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి గురువారం సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వైద్య సేవలపై సూపరింటెండెంట్ రవిశంకర్, ఆర్ఎంఓ ఆనంద్‌గోపాల్‌రెడ్డిల వివరణ తీసుకున్నారు. అనంతరం ప్రతి విభాగాన్ని కలియ తిరిగి తనిఖీ చేశారు. వార్డుల్లో వైద్య సేవలు పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలను అందించాలని వైద్యులకు సూచించారు.

మహాసభలు జయప్రదం చేయండి

దళిత బహుజన శ్రామిక యూనియన్



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

దుద్యాల్: దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు కోరారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని దుద్యాల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బహుజన హక్కులను రక్షించుకోవాలన్నారు. ప్రస్తుతం బహుజనులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వారికి కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న జిల్లా మహాసభలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన దళిత బహుజన శ్రామిక యూనియన్ మండల అధ్యక్షుడు కర్రె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జగన్‌మాత, కార్యదర్శి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి నర్సమ్మ, కోశాధికారి అంజిలయ్య, సలహాదారులు వెంకటయ్య, మదరప్ప, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

గాజీపూర్‌లో కూలిన ఇల్లు



కూలిన ఇంటి వద్ద బాధిత కుటుంబం

పెద్దేముల్: మండల గాజీపూర్ గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి ఓ ఇల్లు కూలిపోయింది. ప్రాణనష్టం జరుగలేదని అధికారుల ద్వారా తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండల గాజీపూర్ గ్రామానికి చెందిన గడ్డమీది యాదప్ప ఐదేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నారు. గత నెల రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఇల్లు వెనుక భాగం తడిసి గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒక్క సారి కూలి పడింది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామని యజమాని యాదప్ప తెలిపారు. ప్రభుత్వమే తమని ఆదుకోవాలని కోరారు.

డ్రోన్ల కలకలం

బొంరాస్‌పేట: మండలంలోని పలు గ్రామాలు, గిరిజన తండాల్లో రాత్రిపూట డ్రోన్‌ల సంచారం కలకలం రేపింది. రాత్రిపూట సర్వేలు చేస్తున్నారంటూ లంబాడా హక్కుల పోరాట సమితి మండల వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌నాయక్ ఆరోపించారు. మండల పరిధిలోని బోడబండ తండా, మేడిచెట్టుతండా, బాపల్లి పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట గాల్లో డ్రోన్‌లు చక్కర్లు కొడుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రాత్రిపూట గాల్లో డ్రోన్ కెమెరా

అక్రమంగా బోర్‌వెల్ తరలింపు

పరిగిలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



పట్టుబడిన బోర్‌వెల్ వాహనం

పరిగి: రోజురోజుకు అక్రమార్కుల ఆగడాలు ఎక్కు వయ్యాయి. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఉగాండా(ఆఫ్రికా) దేశానికి తరలిస్తున్న బోర్‌వెల్ బండిని బుధవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్న సంఘటన పరిగి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలో అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నంబర్ ప్లేట్ లేని బోర్‌వెల్ బండి రావడంతో పోలీసులు ఆపి వివరాల అడిగారు. పత్రాలు లేకపోవడంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఇటీవల పట్టుబడ్డ బోర్‌వెల్ మాదిరిగానే ఉగాండా దేశానికి వెళ్తున్నట్టు నకిలీ టాక్స్ బిల్లులో ఉన్నట్టు గుర్తించారు. ప్రతినెల యాభైకి పైగా ఇలాంటి అక్రమ రవాణా జరుగుతున్నట్టు సమాచారం. ప్రభుత్వానికి ఎలాంటి ట్యాక్స్ కట్టకుండా అక్రమంగా వాహనాలను తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి పరిగి ఎంపీఐకి అప్పజెప్పినట్టు తెలిపారు. పరిగి మీదుగా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. అక్రమ బోర్‌వెల్ దందాపై పూర్తి వివరాలను ఉన్నతాధికారులు సేకరిస్తున్నారని తెలిపారు.

పేదింటి బిడ్డలకు డాక్టర్ సీటు



ప్రియాంక



శంకర్

దౌల్తాబాద్: పేదింటి బిడ్డలు ఎంబీబీఎస్ సీటు సాధించారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోటం ప్రియాంక ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆల్ ఇండియా ర్యాంకు 2.04లక్షలు, స్టేట్ ర్యాంకు 4,400 వచ్చింది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయం కుటుంబానికి చెందిన కొటం సయమ్మ, రాములు. ప్రియాంక ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రైవేట్ పాఠశాల, ఏడు నుంచి పది వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఇంటర్ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం సరూర్‌నగర్‌లో చదివింది. ఎంబీబీఎస్ సాధించడం గర్వంగా ఉందని ఆమె ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

మెరిసిన గిరి పుత్రుడు

బొంరాస్‌పేట: చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన మండల గిరిజన విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. మండల పరిధిలోని మూడుమామిళ్లతండా గ్రామపంచాయతీ డీప్లానాయక్ తండాకు చెందిన చౌహ్వాన్ శంకర్‌కు ఆల్ ఇండియా ర్యాంకు 2.80లక్షలు, స్టేట్ ర్యాంకు 7,165 వచ్చింది. ఆర్‌వీఎం సిద్దిపేట కళాశాలలో సీటు దక్కింది. ఆయన తల్లిదండ్రులు కమ్లీబాయి, చందర్. వీరు వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తారు. శంకర్ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు జెడ్పీహెచ్ఎస్ రేగడిమైలారంలో, ఇంటర్ కొత్తగూడెం గురుకుల సీఓఈ కళాశాలలో 2019–21 వరకు చదివాడు. గిరిజన విద్యార్థిగా ఎంబీబీఎస్ సాధించడం గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాతను గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. అనంతరం సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలకు బహుమతులు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు మున్సిపల్ పరిధిలోని 12 వార్డుల్లో ... వార్డుకు 9 మంది చొప్పున 108 మిక్సీలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన గురునాథ్‌రెడ్డి విజేతలకు మిక్సీలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవీ నవరాత్రులను ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. దసరా పండుగ రోజు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మాజీ ఎంపీపీ దేశ్‌ముఖ్, సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గుప్తా, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్ గుప్తా, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్, న్యాయవాది రవీందర్‌నాయక్, బీజేపీ నాయకుడు చంద్‌లాహోటీ, వెంకటయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు



పెద్దేముల్‌లో కూరగాయలు విక్రయాలు

పెద్దేముల్: రోజు రోజుకూ కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెద్దేముల్ వారాంతపు

కిలో టమాటా రూ.100

సంతలో కిలో టమాటా రూ.100లు పలికింది. ఏ కూరగాయ కొనాలన్నా రూ.80 నుంచి రూ.100 వరకు ఉండటంతో సామాన్యులు హడలిపోతున్నారు. కిలో ఆకుకూరలు కూడా రూ.50లకు విక్రయిస్తున్నారు. ఇటీవల కురిసన భారీ వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బతినడంతో దిగుబడి లేక ధరలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. దీనికి తోడు నిత్యావసర సరుకుల ధరలు కూడా భారీగా పెరిగాయి. దసరా పండుగ పూట ధరలు పెరగడంతో సామాన్యులు అల్లాడిపోతున్నారు.

రతన్‌టాటా సేవలు మరువలేనివి

తాండూరు: వ్యాపార దిగ్గజం రతన్‌టాటా భారతదేశానికి రత్నం లాంటి వారని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న కొనియాడారు. గురువారం తాండూరు పట్టణంలోని గాంధీచౌక్‌లో టాటాగ్రూప్స్ మాజీ చైర్మన్ రతన్‌టాటా మరణించడం పట్ల వ్యాపారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేయడంతో పాటు కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో రతన్‌టాటా చేసిన సేవలు దేశ ప్రజలు మరిచిపోలేరన్నారు.

హస్నాబాద్‌లో..

దుద్యాల్: ప్రముఖ పారిశ్రామిక వేత్త టాటా సన్స్ చైర్మన్ రతన్ టాటా మృతి పట్ల మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామ శివారులో ఉన్న ఎస్వీర్ టాటా వాటర్ ప్యాకేజింగ్ కంపెనీ కార్మికులు గురువారం సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంపెనీ మేనేజర్ ప్రవీణ్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. రతన్ టాటా ఉప్పు నుంచి ఉక్కు వరకు విలువలతో కూడిన వ్యాపారాలు చేసి దేశంలోనే అత్యంత పారిశ్రామిక శక్తిగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో కార్మికులు మల్లేశ్, నాగేశ్, గోపి, జగన్, మురలి, కృష్ణ, దౌల్తాబాద్ మల్లేశ్, మహిళ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు



తాండూరు: రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం



తిమ్మాయిపల్లిలో ఇళ్ల మధ్య నెలకొన్న మురుగు

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని మహాత్మాగాంధీ ఆనాడే సెలవిచ్చారు. ప్రస్తుతం పల్లెల్లో పాలన గాడి తప్పుతోంది. ప్రత్యేకాధికారుల దృష్టి గ్రామాలపై లోపించింది. ఫలితంగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.

పత్తాలేని ప్రత్యేక అధికారులు

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- వీధుల్లో వ్యాపిస్తున్న దుర్గంధం
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు

దౌల్తాబాద్: సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. అయితే వారు బాధ్యతలు చేపట్టి నెలలు గడుస్తున్నా అటువైపు మాత్రం కన్నెత్తి చూడడంలేదు. దీంతో గ్రామాలు కంపుకొడుతున్నాయి. మురుగు కాలువలు నిండాయని, వీధులు కంపుకొడుతున్నాయని విన్నవించడానికి అధికారులు కరువయ్యారు. మండలంలో తిమ్మాయిపల్లి, సుల్తాన్‌పూర్, చంద్రకల్, గుముడాల, నర్సాపూర్, కొడిడ్, గోకఫసల్‌వాద్, తిర్మాలాపూర్ తదితర గ్రామాల్లో మురుగు కాలువలు నిండి దుర్గంధం వ్యాపిస్తోంది. పంచాయతీ కార్యదర్శులు సైతం కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇలాంటి దుస్థితి నెలకొందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వీధులు అధ్వానం

గ్రామాల్లోని వీధుల్లో మురుగు పేరుకుపోవడంతో రోగాలు పెరిగే అవకాశం ఉన్నాయి. అకాల వర్షాలు, ఈదురుగాలుల బీభత్సం వల్ల మురుగు కాలువలు నిండాయి. మండలంలో పంచాయతీ కార్యదర్శులు నామమాత్రపు విధులు నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం వీధులు శుభ్రం చేయించాల్సిన వారే కనీసం అటువైపు రావడం లేదు. దీంతో రోడ్లపై గడ్డి, పిచ్చి మొక్కలు మొలవడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే వాళ్లకు దుర్గంధం వ్యాపిస్తోంది. గతంలో మురుగు కాలువలు నిండితే స్థానిక సర్పంచ్‌కు చెబితే సిబ్బందిని పంపించి శుభ్రం చేయించేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్న పరిస్థితులు దాపురించాయి.

నిధుల కొరత

అయితే ప్రత్యేక అధికారుల పాలన నాటి నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. తమ సొంత డబ్బులతో పనులు చేయిస్తున్నామంటున్నారు. కనీసం సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వాలన్నా నిధులు లేవంటున్నారు. అయినా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం కృషి చేస్తున్నామంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం ఉన్న మాట వాస్తవమే. పంచాయతీలకు నిధుల కొరత ఉంది. ఈ మేరకు కార్యదర్శులకు సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశాను. వర్షాకాలంలో పంచాయతీలో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించా. ఆ దిశగా గ్రామాల్లో చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్